క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన మిన్నెలగారి రమణ (45) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ. 10 వేలను మృతుడి భార్య లక్ష్మీదేవికి సర్పంచ్ శ్రీరాములు అందజేశారు. వైఎస్సార్ బీమా పథకం బాధిత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ షాహీన, మహిళా పోలీస్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

సంజామల(కోవెలకుంట్ల): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరానికి వివిధ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సంజామల కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలేఖ తెలిపారు. సంజామలలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సర ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అనాథపిల్లలు, బడిబయటి పిల్లలు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల బాలికలు ప్రవేశాలకు అర్హులన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రీసర్వేను విజయవంతం చేయండి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ప్రారంభమయ్యే జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష రీసర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీసర్వే ప్రయోజనాలపై గ్రామ రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

అత్యధికంగా నష్ట పరిహారం అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : గుంతకల్ నుంచి బిజయవాడ వరకు విస్తరిస్తున్న రైల్వే డబుల్ లైన్ ఏర్పాటులో నష్టపోతున్న బాధితులకు మార్కెట్ రేటు కంటే రెండు రెట్లు అధికంగా పరిహారం అందిస్తామని రెవిన్యూ డివిజన్ అధికారి వెంకటరెడ్డి అన్నిరు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం సాయిత్రం బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా కొనుగోలు అమ్మకాల ధరలను పరిగణలోకి తీసుకోని సరాసరి ఎక్కువ రేటును చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. నంద్యాల రైల్వే పట్టాల సమీపంలో గృహాలు కోల్పోతున్న వారి వివరాలను సేకరించి స్థలంతోపాటు భవనాలకు విడివిడిగా నష్టపరిహారం ఒకే సారి చెల్లిస్తామని, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరచండి

అవుకు: మండల పరిధిలోని సంగపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం కల్చరల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం హెచ్ఎం ఇసాక్ సొంత నిధులతో విద్యార్థులకు పరీక్షల ప్యాడ్, స్కేల్, పెన్, ఎరేజర్‌లను పంపిణీ చేశారు. పది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపాలని హెచ్ఎం సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రవికుమార్, శేఖరుడు, షరీఫ్, సుజాత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.99 వేలు ఆదాయం

ప్యాపిలి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం పంచాయతీ పరిధిలోని దుకాణాలకు, వారపుసంత మార్కెట్, దిన కూరగాయల మార్కెట్, బస్టాండ్‌లోని దుకాణాలు, మాసం మార్కెట్ తదితర పద్దులకు వేలం పాటలు జరిగాయి. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా నారాయణమూర్తి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరు కాగా ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గతేడాది కంటే ఈ ఏడాది గ్రామ పంచాయతీకి రూ. 99 వేలు ఆదాయం వచ్చిందని ఈఓఆర్డీ తెలిపారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్యాపిలి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూపర్‌వైజర్ దేవకృప సూచించారు. స్థానిక ఏడో అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన ఆకు కూరలు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలు, చిరు ధాన్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఫర్జాన, నాగమణి, నీరజ, విజయకుమారి, చాముండి, రత్నాలు, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు 'బైపాస్'

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవ
- బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ. 50 కోట్లు మంజూరు
- పట్టణంలోనూ రోడ్డు విస్తరణకు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకుంటున్న వైనం
- తొలగనున్న ట్రాఫిక్ ఇబ్బందులు



ప్రజలు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి(ఫైల్)

బనగానపల్లె: పట్టణ ప్రజల ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. దాదాపు యాభైవేల జనాభా ఉన్న బనగానపల్లె పట్టణం రోజురోజుకూ విస్తరిస్తుంది. నవాబుల కాలంనాటి ఇరుకైన రోడ్లలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి రూ. 50 కోట్లు మంజూరైంది. పట్టణం చుట్టూ మూడు కిలోమీటర్ల దూరం బైపాస్‌రోడ్డు (రింగ్‌రోడ్డు) ఏర్పాటు కానుంది. నంద్యాల, కర్నూలు, డోన్, తాడిపత్రి రోడ్లకు కలుపుతూ బైపాస్ రోడ్డు నిర్మించనున్నారు. బనగానపల్లె సమీపంలోని యనకండ్ల వద్ద ఏర్పాటైన జయజ్యోతి సిమెంట్ ప్యాక్టరీకి చెందిన వాహనాలు నిరంతరం పట్టణం మీదుగా వెళ్తున్నాయి. ప్యాక్టరీ నుంచి బనగానపల్లె రైల్వే స్టేషన్‌కు బొగ్గుతో పాటు ముడిసిమెంట్ భారీ వాహనాలు వెళ్తున్నాయి. రాచర్ల వద్ద ఉన్న ప్రియ సిమెంట్, ఎల్ అండ్‌టీ, రామ్‌కో పరిశ్రమాలకు చెందిన వాహనాలు చాలా వరకు బనగానపల్లె మీదుగా వెళ్తుంటాయి. వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య నెలకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పట్టణానికి చుటూ మూడు కిలోమీటర్ల దూరంలో బైపాస్ రోడ్డు ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణానికి 72 ఎకరాలు అవసరం. ప్రభుత్వ భూమి ఆరెకరాలు ఉండగా మిగిలిన 66 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఇప్పటి వరకు రైతుల నుంచి అధికారులు 36 ఎకరాలు సేకరణ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

పట్టణంలో రోడ్డు విస్తరణ...

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి పెట్రోల్ బంకు మీదుగా జీఎంటాకీస్ వరకు రూ.4 కోట్లతో ఫోర్ లైన్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే పోలీసు స్టేషన్ వరకు పనులు పూర్తయ్యాయి. ఇక్కడి నుంచి జీఎం టాకీస్ వరకు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపు మేరకు ఆక్రమణదారులు స్వచ్ఛందగా తొలగింపులు చేపడుతున్నారు. ఎమ్మెల్యే సైతం వారం కిందట అధికారులతో కలిసి ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫోర్‌లైన్ పనులు పూర్తయ్యాక సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పిస్తామనని ఎమ్మెల్యే తెలిపారు. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్న వ్యాపారులను ఎమ్మెల్యే అభినందించారు కూడా.

ట్రాఫిక్ సమస్య ఉండదు



బనగానపల్లె పట్టణంలో చాలా కాలంగా ట్రాఫిక్ సమస్య ఉంది. బైపాస్ రోడ్డు ఏర్పాటుతో పాటు పట్టణంలో ఫోర్‌లైన్స్ నిర్మాణ పనులు పుర్తయిన తర్వాత ఈ సమస్య ఉండదు. బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు అధికారులు త్వరగా పూర్తి చేయాలి.
– అనిల్‌హుస్సేన్, మండల కో ఆప్షన్ సభ్యులు,బనగానపల్లె

ఎంతో ఉపయోగకరం



బనగానపల్లె పట్టణానికి బైపాస్ రోడ్డు ఏర్పాటు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. రైతుల సమ్మతితో భూసేకరణ చేసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. బనగానపల్లె కేంద్రంగా వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో చాలా కాలంగా ట్రాఫిక్ సమస్య నెలకొంది. – కిశోర్‌కుమార్, బనగానపల్లె

భూసేకరణ పూర్తి చేస్తాం

బైపాస్ రోడ్డు నిర్మాణానికి కావాల్సి భూ సేకరణ త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. రోజురోజుకు పట్టణ జనాభా పెరుగుతున్నందున బైపాస్ రోడ్డు ఏర్పాటు ఎంతో అవసరం. వాస్తవానికి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. బైపాస్ రోడ్డుకు 72 ఎకరాలు అవసరం ఉంది. ఇప్పటి వరకు దాదాపు 36 ఎకరముల భూసేకరణ జరిగింది. త్వరలో భూసేకరణ పూర్తి చేస్తాం.
– హుస్సేన్, ఏఈఈ ఆర్అండ్‌బీ బనగానపల్లె మండలం

ఎస్సీ, ఎస్టీ కేసులో ఒకరి అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో శుక్రవారం ముగ్గురిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో పోలూరు శ్రీనివాసులు రెడ్డి అరెస్టు చేసినట్లు డోన్ ఇన్‌చార్జ్, ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్ రెడ్డి శనివారం రాత్రి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉమేష్ చంద్ర సేవలు చిర స్మరణీయం

డోన్ టౌన్: ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్ర జయంతిని పురష్కరించుకుని శనివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆయన చిత్ర పటానికి సబ్ జైల్ సూపరిడెంట్ రఘునాథరెడ్డి, అగ్నిమాపకశాఖ కేంద్రం అధికారి రంగస్వామి గౌడ్, సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉమేష్ చంద్ర ధైర్య సహసాలకు ప్రతిరూపమని, విధి నిర్వాహనలో దుర్గాల తూటాలకు బలయ్యారని వారు గుర్తు చేశారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

అవుకు: మండల పరిదిలోని శింగనపల్లెలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈఓ వీరన్న, తహసీల్దార్ శ్రీనివాసులు సమక్షంలో స్వామివారి మూలవిరాట్‌ను తొలగించి, గర్భగుడిలో దాదాపు ఐదు అడుగుల మేరా తవ్వి పరిశీలించారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులకు రూ.40లక్షలు సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఐ వెంగల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, వీఆర్ఓ రాజ్యలక్ష్మి, గ్రామపెద్దలు ముక్కమళ్ల పుల్లారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

జనం ఛీకొట్టినా బాబుకు బుద్ధి రాలేదు

- ప్రలోభాలు, డబ్బు ఎర బాబుకు అలవాటే
- పచ్చ మీడియాను అడ్డుపెట్టుకుని కుట్ర రాజకీయాలు
- టీడీపీకి మరోసారి గుణపాఠం తప్పదు
- ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కర్రా గిరిజ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఐడీసీ ఛైర్‌పర్సన్ కర్రా గిరిజ

కోవెలకుంట్ల: 2019 సార్వత్రిక ఎన్నికలు, తర్వాత జరిగిన స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రజా కోర్టుల్లో టీడీపీని ప్రజలు ఛీకొట్టినా ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు బుద్ధి రాలేదని ఏపీ ఐడీసీ ఛైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్రా దంపతులు మాట్లాడుతూ ప్రజల్లో ఆదరణ కోల్పోయినా బాబు పచ్చ మీడియాను అడ్డుపెట్టుకుని కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విడిపోయిన రాష్ట్రానికి అనుభవం ఉన్న నాయకుడు సీఎం అయితే మేలు చేస్తాడని 2014 ఎన్నికల్లో బాబుకు ఓట్లువేసి గద్దెనెక్కిస్తే అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఆ ఐదేళ్లలో ఇచ్చిన ఏఒక్క హామీ నెరవేర్చకపోగా వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి అప్పట్లో నీచ రాజకీయాలకు పాల్పడిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకు ప్రతీకారంగా 2019 ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి కేవలం 23 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి అక్రమమార్గంలో ఒక ఎమ్మెల్సీని దక్కించుకున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రపూరిత రాజకీయాలు చేసినా రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని జోస్యం చెప్పారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



వాహన రిజిస్ట్రేషన్ పత్రాన్ని లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర పథకం కింద అవుకు మండలానికి చెందిన ఎస్ పుల్లయ్యకు రూ. 4.49లక్షల మొబైల్‌వ్యాన్, సుబ్బయ్య అనే వ్యక్తికి రూ.75 వేల టీవీఎస్ మోపెడ్‌ను 40 శాతం రాయితీపై మంజూరైంది. ఈ మేరకు వీటిని ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ మత్స్యకారుల సౌకర్యార్థం ప్రభుత్వం అందజేస్తున్న వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పామన్న, ఎంపీడీఓ శివరామయ్య, విలేజ్ ఫిషరిస్ అసిస్టెంట్ శిరోమణి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన సోమయాజులపల్లె వృషభాలు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కానాలలో వెలసిన సుంకులమ్మ తిరునాలను పురష్కరించుకుని రాష్ట్రస్థాయి ఎడ్ల బలపదర్శన పోటీల్లో బండిఆత్మకూరు మండలం సోమయాజుపల్లె వృషభాలు సత్తా చాటాయి. పాలపండ్ల విభాగంలో నిర్వహించిన పోటీల్లో పది జిల్లాలకు చెందిన పది జతల వృషభాలు పాల్గొన్నాయి. వృషభరాజముల యజమానులకు దాతల సహకారంతో శనివారం నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఆ గ్రామానికి చెందిన నర్సయ్య యాదవ్ వృషభాలు నిర్ణీత ఇరవై నిమిషాల వ్యవధిలో 5,302 అడుగులదూరం రాతిదూలం లాగి విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ. 40వేలు కైవసం చేసుకున్నాయి. సంజామల మండలం ముక్కమల్ల ముసాని చంద్రశేఖర్‌రెడ్డి వృషభాలు 4,800 అడుగుల దూరంతో ద్వితీయ, డోన్ మండలం మల్లెవేములకు చెందిన షేక్ మైమున్నీ వృషభాలు 4.715 అడుగుల దూరంతో తృతీయ స్థానంలో నిలిచి రూ. 30వేలు, రూ. 20వేలు దక్కించుకున్నాయి. కోడుమూరు మండలం వెంకటగిరి కృష్ణప్రసాద్, బనగానపల్లె మండలం పాతపాడుకు చెందిన శివరాముడు, మహానంది మండలం తమ్మడపల్లె రామకృష్ణ, బేతంచెర్ల మండలం కొత్తపల్లె చిన్న నారాయణ వృషభాలు తర్వాతి స్థానాల్లో నిలిచి రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5వేలు, రూ. 3 వేలు కైవసం చేసుకున్నాయి.

విద్యతో పాటు క్రీడలు అవసరం



టోర్నమెంట్ పోటీలను ప్రారంభిస్తున్న కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లె: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యతో పాటు క్రీడాలు ఎంతో అవసరమని వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కాటసాని ఓబులరెడ్డి యూత్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు అవరణలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను కాటసాని తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 40 జట్టు పాల్గొన్నాయి. విజేతలకు రూ.30వేలు, రూ.20వేలు,రూ.10వేలు అందజేస్తామని నిర్వాహకులు మహేంద్ర, ప్రతాప్, హర్ష, జానీలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబటిరవి కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అత్తార్ అఖీల్‌హుస్సేన్, మహమ్మద్ ఈసారి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి



ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్ఓ పుల్లయ్య

బనగానపల్లెరూరల్: ప్రైవేట్ పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఆర్ఓ పుల్లయ్య అన్నారు. మండలంలోని భానుముక్కలలో సర్వేనంబరు 313లో 2.597 హెక్టార్లలో క్వారీలీజు కోసం జీఎంఆర్ స్టోన్‌క్రషర్ అధినేత గాలిమద్దిలేటిరెడ్డి దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో శనివారం డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా కాలుష్యనియంత్రణ మండలి అధికారి మునిప్రతాప్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సభ జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఓ పుల్లయ్య మాట్లాడుతూ పరిశ్రమ యజమానులు స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, శబ్ద, గాలి కాలుష్య నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే మొక్కలను సంరక్షిం చాలని, ఆయా పరిశ్రమల పరిధిలో ఉన్న గ్రామాల్లో మౌలిక వసతులకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్, వీఆర్ఓ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లయ్య, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దిన్, పారిశ్రామికవేత్త దొనపాటి యాగంటిరెడ్డి, పీఆర్ మురళీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

బనగానపల్లె: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలోని 1499 డ్వాక్రా సంఘాలకు రూ.10.79 కోట్లు నిధులు మంజూరుకావడంతో శనివారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథకం కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి మహిళలు పాలా భిషేకం చేశారు. ఏపీఎం తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జిల్లాలోనే మండలానికి ఎక్కువ మొత్తం పొదుపు మహిళాలకు లబ్ధి చేకూరిందన్నారు. పొదుపు మహిళలు సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపేతం కావాలని సూచించారు.

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా మూడవిడత నిధుల విడుదల చేసిన కార్యక్రమాన్ని స్థానిక వైకేపీ కార్యాలయంలో పొదుపు మహళలు వీక్షించారు. మండలంలో రూరల్, టౌన్ కలుపుకొని 1352 గ్రూపులు, 13 ,186 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా కిద మూడవ విడతలో రూ.8,30,75,914 కోట్లు మహిళలో అకౌంట్లలో జమ అయ్యిందని ఏపీఎం లింగమయ్య తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మెప్మా కోర్డినేటర్ శ్రీదేవి, వనితా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి దేవి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: వైఎస్సార్ ఆసరా మూడవ విడత కోవెలకుంట్ల క్లస్టర్‌లోని ఐదు మండలాల పరిధిలో 4,282 పొదుపు సంఘాలకు రూ. 28.29 కోట్లతో లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్ క్రాంతి పథ ఏరియా కో ఆర్డినేటర్ గురుస్వామి తెలిపారు. బనగానపల్లె మండలంలో 1,499 పొదుపు సంఘాలకు రూ. 10.79 కోట్లు, కోవెలకుంట్ల - 655 పొదుపు సంఘాలకు రూ. 3.74 కోట్లు, సంజామల- 640 గ్రూపులకు రూ. 5.43 కోట్లు, కొలిమిగుండ్ల - 915 గ్రూపులకు రూ. 4.95 కోట్లు, అవుకు మండలంలో 573 పొదుపు సంఘాలకు రూ. 3.37 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆయా మండలాల్లో పది రోజులపాటు వైఎస్సార్ ఆసరా సంబరాలు జరుగుతాయని తెలిపారు.

ప్యాపిలి: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్యాపిలి మండలంలోని 931 స్వయం సహాయక సంఘాలకు రూ. 4,86,55,000 మంజూరైనట్లు ఏపీఎం కృష్ణమూర్తి తెలిపారు. మొత్తం 9,196 మంది సభ్యులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. మంజూరైన మొత్తం నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ అవుతుందన్నారు.

జాతీయ ఉపకారవేతనాలకు విద్యార్థుల ఎంపిక

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ ఉపకారవేతనాలకు (ఎన్ఎంఎంఎస్) ఎంపికైనట్లు స్కూల్ హెచ్ఎం జి.బయ్యన్న శనివారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు ఉషశ్రీ, నిహారిక, సూర్యకమల్‌కు నాలుగేళ్లపాటు ఏటా రూ.12వేల ఉపకారవేతనం లభిస్తోందని హెచ్ఎం తెలిపారు.

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం ముక్కమల్ల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి మహేష్‌బాబు జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్ఎం నాగరాజు తెలిపారు.

కొలిమిగుండ్ల: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు రమ్య, మధు వసంత, కళ్యాణ్ బాబు, మహ్మద్ షరీప్, కిరణ్‌తేజ, రవికుమార్ జాతీయ ఉపకారవేతనాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి తెలిపారు.

ప్యాపిలి: బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి తరుణ్ కుమార్ నాయుడు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడనిహెచ్ఎం మధుసూదనశర్మ తెలిపారు.

అవుకు: జాతీయ ఉపకార వేతనాలకు 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ శ్రీధర్ రావు తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన చాకలి నీతేజ్, తిగ్గసాని గౌతమ్, పసుపల రాకేష్, సుగాలి తరుణేశ్వర నాయక్, యూరబోయిన హేమంత్ కుమార్ ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా వేములపాడులో గుంతనాల లక్ష్మి హర్షిత, చెన్నంపల్లెలో మారం అధితిని, గుండ్లశింగవరంలో వగ్రా మహాలక్ష్మి, కునుకుంట్లలో సుగాలి కార్తిక్ నాయక్, సుంకేసులలో మంగలి నందిని, అవుకులో నాగవైష్ణవి ఎంపికయ్యారని తెలిపారు.

రూ. 8.22 లక్షలకు బస్టాండ్ మార్కెట్ పనుల వేలం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మార్కెట్ పనుల నిర్వహణకు శనివారం మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన వేలం పాటలో పనులను పట్టణానికి చెందిన శ్రీనివాసులు రూ. 8.22 లక్షలకు దక్కించుకున్నారు. గతేదాడితో పోలిస్తే రూ.1.81 లక్షల ఆదాయం తగ్గింది. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ బాలాంజనేయులు పాల్గొన్నారు.

నేచురోపతి దినోత్సవం

బనగానపల్లెరూరల్: స్థానిక పొదుపు భవనంలో నేచురోపతి దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, వీరం మురళీధర్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో రోగనిరోధక శక్తి పెంపు, ఆహార చికిత్సలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ శివరామయ్య మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు వంటి ప్రకృతి ప్రసాదించి ఆహారం ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ రోజారాణి, సూపర్ వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠ విగ్రహాలకు గ్రామోత్సవం



సీతారామాంజనేయుల విగ్రహాలకు పూజలు చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

అవుకు: మండల పరిధిలోని గడ్డమేకలపల్లెలో శ్రీసీతా రామాంజనేయ స్వాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజల అనంతరం సీతారామలక్ష్మణ, హనుమంతుడి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి విగ్రహాలకు, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డమేకలపల్లెలో సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10లక్షలు సాయం అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, సీఐ సుబ్బరాయుడు, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, నాయకులు బండి బ్రహ్మనందరెడ్డి, కోనేటి సుంకన్న, కోనేటి తిరుపతయ్య, ఈడిగ బాలరాజు, కోనేటి వెంకటేశ్వర్లు, దేవరకొండ గంగన్న, పుల్లన్న, కుళ్లాయప్ప, కోనేటి సుధాకర్, మూరబోయిన మనోహర్, చిన్నతిమ్మయ్య పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయంలో పూజలు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి, రథ మహోత్సవాలను పురష్కరించుకుని పాణ్యం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ రామానుజన్, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి,అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానం అభినందనీయం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో తీర్మానం చేయడం అభినందనీయమని వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీ కృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వాల్మీకి నాయకులు బుగ్గానిపల్లె రాముడు, కృష్ణమూర్తి, ఆకుల రమణ, బలరాముడు ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పుష్పాభిషేకం, పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులకు రాజకీయంగా సముచిత స్థానంతో కల్పించడమే కాకుండా, ఎస్టీ రిజర్వేషన్ సాధనకు సీఎం సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు ఎర్రమల, వెంకట్రాముడు, నిరంజన్, కిరణ్, లక్ష్మయ్య, రంగస్వామి, నాగ వెంకటేశ్వర్లు, సుధాకర్, నాగరాజు, రంగనాయకులు పాల్గొన్నారు.

అవుకు: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అసెంబ్లీ తీర్మానంపై నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రం అవుకులోని చెన్నకేశవ ఆలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బోయసంఘం అధ్యక్షుడు బోయ ఎర్రన్న, నాయకులు మీనిగె శ్రీరాములు, బోయ జగన్, బోయ రాజు, తలారి సుబ్బరాయుడు, బోయ పుల్లయ్య, బోయ మధుక్రిష్ణ, ప్రేమ్ కుమార్, చిన్నరాముడు, బోయ చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ప్యాపిలి వృషభాలు

బేతంచెర్ల: మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సుంకుల పరమేశ్వరీ దేవి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి పాల పండ్ల సైజు వృషభాలకు బండ లాగుడు పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. హోరా హోరీగా సాగిన ఈ బండలాగుడు పోటీల్లో ప్రథమ స్థానం ప్యాపిలి మండలం గుడి పాడుకు చెందిన రావుల వెంకటరామిరెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా, పెద్దపప్పూరు మండలం చాగళ్ల గ్రామానికి చెందిన ఆదినారాయణ వృషభాలు ద్వితీయ స్థానం కైవసం చేసుకోగా, ఎమ్మిగనూర్ మండలం కడివిల్లు గ్రామం రంగస్వామి వృషభాలు మూడవ, వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి సుంకులమ్మ బుల్స్ నాల్గవ, బేతంచెర్ల మండలం, హుసేనాపురం రామ సుబ్బారెడ్డి వృషభాలు ఐదవ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు వరుసగా రూ. 30 వేలు, రూ.20 వేలు , రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 5వేలు చొప్పున దాతల చేతుల మీదుగా అందజేశారు.